రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 27 : ఓయూ దూర విద్యా కేంద్రమైన ప్రొ. జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే పీజీ డిప్లామా ఇన్ డేటా సైన్స్ కోర్సు పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.శశికాంత్ తెలిపారు. ఈ కోర్సు మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 30 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో వచ్చే నెల 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 30వ లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

హక్కుల సాధనకు ముందుకు సాగాలి

చిక్కడపల్లి : బలహీన వర్గాల హక్కుల సాధనకు ముందుకు సాగాలని యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ దయానంద్ అన్నారు. మాల మహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేశ్ ఆధ్వర్యంలో బుధవారం జవహర్‌నగర్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్యఅతిథిగా యానంద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యునైటెడ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్ల కాశీనాథ్, నాయకులు మన్నె శ్రీధర్, బొనగిరి మంగ, నాగెల్లి కృష్ణ, ఎన్. వెంకటేశ్ పాల్గొన్నారు.

దేవాలయ భూమి కబ్జాకు యత్నం

అడ్డుకున్న స్థానికులు, ఎండోమెంట్ అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 27: రాజేంద్రనగర్ మండల పరిధిలోని అత్తాపూర్ డివిజన్ ,రాంబాగ్‌లోని శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయ భూములను కొందరు కబ్జాకు యత్నించి.. నిర్మాణాలు చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు, ఎండోమెంట్ అధికారులు ఆ పనులను అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఆందోళన నెలకొన్నది. కాగా..ఇప్పటికే అత్తాపూర్ సీతారామచంద్ర స్వామి దేవాలయంతోపాటు అనంత పద్మనాభస్వామి దేవాలయం భూముల్లో అనేక అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీనిపై గతంలో లోకాయుక్త న్యాయవాదులు సర్వేలు జరిపి ఇవి దేవాలయ భూములుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మోటేషన్ చేశారు. అయినా.. బుధవారం ఉదయం కొందరు కబ్జాదారులు దేవాలయాన్ని ఆనుకొని ఉన్న కాంపౌండ్ వాల్‌ను కూల్చివేసి.. ఆ స్థలం తమదే అంటూ గేటు ఏర్పాటు చేసి బోర్డులు పాతారు. ఇదివరకే దేవాదాయ శాఖ వారు కాంపౌండ్ వాల్ కట్టి దాన్ని కాపాడారు. ఉదయం జరిగిన ఘటనతో స్థానిక భక్తులతో పాటు ఎండోమెంట్ శాఖ అధికారులు విచ్చేసి ఆ స్థలం దేవాలయానిదేనని చెప్పారు.

రాంబాగ్ అనంత పద్మనాభ స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న గేటు పనులను అడ్డుకుంటున్న స్థానికులు, ఎండోమెంట్ అధికారులు

ఈ భూమి ఆలయానిదే..

రాంబాగ్‌లోని శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి సంబంధించిన సర్వే నంబర్. 523లో 8.25 ఎకరాల స్థలం ఉందని రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ తెలిపారు. ఇది చాలా పురాతనమైన దేవాలయం కావడంతో కొందరు ఈ స్థలంపై కన్నేసి తమదే ఆ స్థలం అని అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. దేవాలయానికి సంబంధించిన భూమిలో ప్రహారీ ఏర్పాటు చేశామన్నారు. దీన్ని బుధవారం కొందరు కూలగొట్టి గేటు ఏర్పాటు చేస్తున్నారన్నారు. విషయం తెలుసుకొని రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సిబ్బంది, ఏవోలు అధికారులు అక్కడికి వెళ్లి పనులు ఆపివేయించామన్నారు. పోలీసులకు పూర్తి నివేదికను అందించి దేవాలయ భూమిని కాపాడాలని కోరారు. ఈ భూమిపై కోర్టులో కేసు ఉందన్నారు. కేసు పెండింగ్‌లో ఉన్న కారణంగా ఇందులో ఎవరు పనులు చేయడానికి అనుమతి లేదన్నారు. అనంతరం ఎండోమెంట్ శాఖ అధికారి స్థానిక అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘనంగా నేషనల్ ప్రేయర్ డే ..

రానున్న క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని బుధవారం నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నేషనల్ ప్రేయర్ డేను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో జూబ్లీహిల్స్ నుంచి వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో పాటు నగర నలుమూలల నుంచే కాక రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, భక్తులు హాజరయ్యారు. ఈ వేడుకల్లో మాసబ్‌ట్యాంక్ రాక్‌చర్చ్ సీనియర్ పాస్టర్ డాక్టర్ దీవెన్‌కుమార్ , డాక్టర్ యేసుపాల్, పాస్టర్ బెర్నార్డ్‌ల ఆధ్వర్యంలో రాక్‌చర్చ్ క్వాయర్ బృందం ప్రత్యేక క్రైస్తవ గీతాలను ఆలపించారు.

– జూబ్లీహిల్స్, నవంబర్ 27

జూబ్లీహిల్స్ క్లబ్ మాజీ కార్యదర్శితో ప్రాణహాని

ఖైరతాబాద్, నవంబర్ 27 : జూబ్లీహిల్స్ క్లబ్ మాజీ కార్యదర్శితో తనకు ప్రాణహాని ఉందని వ్యాపారవేత్త వెంకటేశ్వర రావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తాను రెడ్‌హిల్స్‌లో వీఎస్‌వీ ప్రింటింగ్ ఇమేజ్ పేరుతో ప్రచురణ రంగంలో వ్యాపారం చేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ క్లబ్ మాజీ కార్యదర్శి హన్మంత రావు తనను సంప్రదించి తన వ్యాపారాల్లో భాగస్వామ్యం కావాలని కోరాడని, అయితే సదరు వ్యక్తి అక్రమ వ్యాపారాలు చేస్తున్నాడని తన దృష్టికి రావడంతో దూరంగా ఉంచానని తెలిపారు. తాజాగా తన వ్యాపారాన్ని మూసివేయాలని, లేని పక్షంలో అంతుచూస్తానని బెదిరిస్తున్నాడని, ఈ నెల 13న కొందరు వ్యక్తులను తన కార్యాలయం మీదకు పంపించి దాడి చేయించారని, దీంతో నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. తనకు హన్మంతరావు నుంచి రక్షణ కల్పించాలని ఆయన పోలీసులను కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర రావు

నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన వింటర్ ఉత్సవ్ మేళాకు పెద్ద ఎత్తున సందర్శకులు తరలి వస్తున్నారు. వివిధ స్టాళ్లలో ఏర్పాటు చేసిన ఉత్పత్తులను పరిశీలించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో నిత్యం సందడిగా మారుతున్నది.

– ఖైరతాబాద్, నవంబర్ 27

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజలు

శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలువైన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో మండలపూజ మహోత్సవాల్లో బుధవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాముల కోసం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

– బంజారాహిల్స్,నవంబర్ 27

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

–జూబ్లీహిల్స్, నవంబర్ 27

హరిహర సుతుడు అయ్యప్ప స్వామి పూజలను వెంగళరావునగర్‌లో ఘనంగా నిర్వహించారు. బుధవారం వెంగళరావునగర్ సీ-టైప్‌లో కిషన్ గురుస్వామి 19వ పడిపూజను నిర్వహించారు. పూజలో కన్స్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరమ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవి శేఖర్ రెడ్డి, ప్రశాంత్ స్వామి, కిశోర్ స్వామి, రంగారావు స్వామి, రమణ స్వామి, కుటుంబ రాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

– వెంగళరావునగర్, నవంబర్ 27

69వ రోజుకు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన

జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించడాన్ని నిరసిస్తూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు 69వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉద్యోగులు యూనివర్సిటీ ప్రాంగణంలో బైఠాయించి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పేదలకు ఉన్నత విద్యను అందిస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మనుగడకు ప్రమాదంగా మారేలా ఉన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగుల జేఏసీ చైర్ పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు డా.ఎల్వీకే రెడ్డి, ప్రొ.మేరీ సునంద, డా.రజినీ, డా.అంబేద్కర్, షబ్బీర్, పాండు, రాములుతో పాటు అడ్మిని స్ట్రేటివ్, టెక్నికల్, నాన్ టెక్నికల్, టైం స్కేల్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్, నవంబర్ 27

జేహెచ్‌పీఎస్‌లో ముగిసిన లైబ్రరీ వీక్

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వారంరోజుల పాటు నిర్వహించిన లైబ్రరీ వీక్ బుధవారం ముగిసింది. పుస్తక పఠనంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచడంతో పాటు వారిలోని సృజనాత్మకతను పెంచేలా లైబ్రరీ వీక్‌ను నిర్వహించామని పాఠశాల ప్రిన్స్‌పాల్ తెలిపారు. లైబ్రరీ వీక్‌లో భాగంగా తమకు ఇష్టమైన పుస్తకాలపై సమీక్ష, క్విజ్ పోటీలు నిర్వహించారు.

– బంజారాహిల్స్, నవంబర్ 27

అనుమతి లేకుండా నల్లా కనెక్షన్లు.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, నవంబర్ 27 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జలమండలి అనుమతిలేకుండా నల్లా కనెక్షన్లు తీసుకున్న వారిపై కేసులు నమోదు చేశారు. జలమండలి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం .. శంషాబాద్ పట్టణంలోని కుమ్మరిబస్తీ, యాదవ్‌బస్తీ, కాపుగడ్డ ప్రాంతాల్లో నివాసముంటున్న రవి, కృష్ణ, కుమార్, అంజయ్య, మహబూబీ, బాలరాజు, భాస్కర్‌లు అనుమతిలేకుండా నల్లా కనెక్షన్లు పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు గుర్తించి వారిపై శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ నల్లా కనెక్షన్‌తో పాటు ఎలక్ట్రికల్ మోటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైన అక్రమ నల్లా కనెక్షన్ తీసుకుంటే వారిపై విజిలెన్స్ అధికారుల బృందానికి ఫోన్: 9989998100,9989987135 లలకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

శంషాబాద్ పట్టణంలో ఒకే ఇంటికి ఉన్న రెండు నల్లా కనెక్షన్లు

లయన్ విజయ్ కుమార్ కన్నుమూత

బంజారాహిల్స్, నవంబర్ 27: ప్రముఖ సామాజిక వేత్త లయన్ అరిగపూడి విజయ్‌కుమార్(74) మంగళవారం అర్ధరాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం. 10లోని తన నివాసంలో కన్నుమూశారు. లయన్స్ క్లబ్ సభ్యుడిగా సేవా కార్యక్రమాలను ప్రారంభించిన విజయ్‌కుమార్ లయన్స్ క్లబ్ గవర్నర్, తదితర పదవులు నిర్వహించి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయ్‌కుమార్ మరణం సేవా రంగంతో పాటు సాంస్కృతిక రంగానికి తీరనిలోటని పలువురు తమ సంతాపం వ్యక్తం చేశారు.

ప్రసాద్ మరణం తీరనిలోటు

మాయత్‌నగర్,నవంబర్27: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి సేవలు అందించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోటు ప్రసాద్ అకాలమరణం సమాజానికి తీరని లోటని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద పోటు ప్రసాద్ చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేం పావనీ, నగర కార్యదర్శి కమతం యాదగిరి, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటయ్య, నేతలు శ్రీకాంత్, సబ్బు రాజమౌళి, రమారాజేశ్ ఖన్నా, బాలసుబ్రమణ్యం, శ్రీనివాస్, జె.వి.క్రిష్ణ, పి.జగన్‌గౌడ్‌పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

బండ్లగూడ, నవంబర్ 27: అతివేగంగా వచ్చిన కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ టోల్ ప్లాజా వద్ద ఓ కారు అతి వేగంగా ప్రయాణిస్తూ.. ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి.. అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. బైక్‌పై వెళ్తున్న వారు కిందపడడంతో వారికి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు వెంటనే గాయపడిన వారికి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తక్షణమే రహదారుల నిర్మాణ పనులు చేపట్టండి

నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ, నవంబర్ 27 : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణతో పాటు నిర్మాణాల కోసం ప్రత్యేకంగా నిధులను వెచ్చిస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నామని నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మిర్జాగూడ, మేకన్‌గడ్డ, ఖానాపూర్ గ్రామాల్లో ఇంజినీరింగ్‌శాఖ డీఈ నరేశ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్‌లతో కలిసి ఆయన రహదారులను పరిశీలించారు. రహదారులు ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అవసరమైన నిధులను వెచ్చించాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న రహదారులను పరిశీలించి ..ముందుగా మంజూరైన నిధులతో తక్షణమే రహదారుల నిర్మాణ పనులను మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు లోపించకుండా నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరగాలన్నారు. ఖానాపూర్ గ్రామ ప్రధాన చౌరస్తా నుంచి గ్రామ చివరి వరకు దాదాపు రూ.కోటి నిధులతో పనులను మొదలు పెట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ నరేశ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మల్లేశ్, స్థానికులు పాల్గొన్నారు.

ఖానాపూర్ ప్రధాన రహదారి విస్తరణపై ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

జూబ్లీహిల్స్,నవంబర్27: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కారణంగా గురువారం వివిధ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బంజారాహిల్స్ సీబీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్ నంబర్-12 సబ్‌స్టేషన్ సీఆర్‌పీఎఫ్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రోడ్ నంబర్-12 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. శ్రీనగర్ కాలనీ సబ్‌స్టేషన్ నాగార్జున నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు.. సత్యసాయి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 27 : ముషీరాబాద్ డివిజన్ జాంబవి నగర్ వద్ద వరద నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం ప్రేయర్ పవర్ చర్చి వద్ద బుధవారం రూ.40 లక్షల వ్యయంతో నాలా, రోడ్డు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షం కురిసిన ప్రతిసారి నాలా పొంగి ఇండ్లలోకి వరద నీరు వచ్చి స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదిక సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాలా స్లాబుకు పగుళ్లు ఏర్పడటంతో వరద నీరు బయటకు వస్తుందన్నారు. నాలా విస్తరణ, స్లాబు నిర్మాణం, అనంతరం రోడ్డు నిర్మాణం చేపట్టడుతామని తెలిపారు. ముషీరాబాద్ కార్పొరేటర్ ఎం.సుప్రియా నవీన్ గౌడ్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, ఏఈ మురళి, బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహ, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీధర్ రెడ్డి, శివముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రేయర్ పవర్ చర్చి వద్ద నాలా అభివృద్ధి పనులు ప్రారంభించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో..

ముషీరాబాద్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. బుధవారం ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రూ. 3.86 లక్షల వ్యయంతో చేపట్టనున్న లైటింగ్ సిస్టంను కార్పొరేటర్ ఎం.సుప్రియా నవీన్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్టేడియం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్రీడాకారుల అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జలమండలి ఓటీఎస్‌కు మూడు రోజులే గడువు..

ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జీఎం హరిశంకర్

జూబ్లీహిల్స్, నవంబర్ 27 : నీటి బిల్లులు చెల్లించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేసిన వారికి అసలుకంటే వడ్డీల మోతే ఎక్కువవుతుంది. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు వ్యాపార, వాణిజ్య సముదాయాలు వడ్డీల భారంతో అసలుకే ఎసరు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో మొండి బకాయిదారుల నుంచి నీటి బిల్లులు వసూలు చేసేందుకు 100 శాతం వడ్డీ మాఫీతో జలమండలి వన్ టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌ను ప్రకటించింది. అక్టోబర్ నెలలో అందుబాటులోకి వచ్చిన ఈ పథకాన్ని వినియోగదారులు 100 శాతం సద్వినియోగం చేసుకునేలా నవంబర్ 30వరకు గడువు పొడిగించారు. కాగా జలమండలి వినియోగదారులు పెండింగ్ నీటి బిల్లుల బకాయిలు చెల్లించేందుకు అమలుచేస్తున్న ఓటీఎస్ పథకానికి మరో మూడు రోజులే గడువు వుంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని పాత బకాయిలు చెల్లించాలని అధికారులు కోరుతున్నారు. బీపీఎల్ వినియోగదారులు మినహాయించి ఓటీఎస్ పథకానికి అర్హులైన వినియోగదారులకు పెండింగ్ బకాయిల్లో వడ్డీతో పాటు లాస్ట్ పేమెంట్ పెనాల్టీలు, మీటర్ పెనాల్టీలు పూర్తిగా మాఫీ చేసి ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పాత బకాయిలు వెంటనే చెల్లించాలని జలమండలి జీఎం ఎస్.హరిశంకర్ కోరారు. ఈ ఆఫర్ గడువు ఈనెలాఖరు వరకు పొడిగించినందున నీటి బిల్లుల బకాయిలు చెల్లించి 100 శాతం వడ్డీ మాఫీ పొందాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు స్థానిక జలమండలి కార్యాలయాలతో పాటు 155313 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వివిధ కోర్సుల పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ తెలిపారు. బీసీఏ (సీబీసీఎస్), బీ ఫార్మసీ (పీసీఐ) ఏడో సెమిస్టర్ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. వాటిని వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చన్నారు.

అలరించిన భక్తిగీతాల విభావరి

ముషీరాబాద్, నవంబర్ 27: రాగరాగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో స్వర జగన్నాథం పేరిట నిర్వహించిన కార్తిక మాస భక్తి గీతాల విభావరి ఆకట్టుకున్నది. గాయకులు ఎం.వి. రమణకుమారి, స్వర్ణ, విజయకుమార్, ఖాసీం, ప్రభాకర్ రావు, కమలాకర్, వేణుగోపాలాచారి, ఉదయ్‌కిరణ్ భక్తీ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో గాయకుడు సీహెచ్ త్రినాథరావు ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను సన్మానించారు. రాగరాగిణి సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు ఎం.వి. రమణకుమారి పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that my **client SRI. RAMESHWAR NAND YADAV S/o SRI. LAXMAN G NAND**, R/o GHMC No. 14-1-55, MANGALHAT, SEETHARAMPET, HYDERABAD. TELANGANA STATE. is Inter to Agreement Of Sale Paid the Advance amount **purchase the Property House GHMC No. 6-5-166/1, On Plot bearing Nos. 72/B & 69/A, admeasuring 150.00 Sq.yards or 125.4 Sq.meters, (Consist G+1 Floor)., Situated at Katedhan Village, Rajendmagar GHMC & Mandal, Ranga Reddy Dist., Telangana State.** with the Owner **No.1. SRI. S.THIMAPPA S/o LATE. S.BALAPPA & No.2. SRI. S.DURGA PRASAD S/o LATE. S. BALAPPA,** Both are R/o H.No. 11-1-890/A/26, AGHAPURA, HYDERABAD. TELANGANA STATE. If any person(s) having any right, interest or claim over the said property may contact the undersigned within **(07) days** from the date hereof with relevant documents, failing which sale deed would be executed and objections if any, received thereafter will not be entertained and deemed to have been waived.

Dt: 27/11/2024

T.D.S. ASSOCIATES.
(C/O DHIRENDRA SINGH, Advocate)
MOHAMMED SHUJAUDDIN @ WASEEM
SHOP No.5-6-3/24, MIM Building, Darrusalam, Aghapura, Hyderabad.T.S.
9490932931, 9490467867.